## ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ముస్తాబాద్, డిసెంబర్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలను నమ్మించి, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏడాది గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు, సర్కారు విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోరాడుతుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేపోతున్నదని దుయ్యబట్టారు. ఆయనపై అక్రమంగా కేసులు పెట్టి ఎలాగైనా జైలుకి పంపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలని చూస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఏడాది పాలనలోనే ప్రభుత్వం, నేతలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని, ఈ క్రమంలో ప్రతిపక్ష నాయకులను కట్టడి చేసేందుకు అనేక కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు వద్దని, ఇచ్చిన హామీలు అమలు చేస్తే ప్రజలే ఆదరిస్తారని, అక్కున చేర్చుకుంటారనే విషయాన్ని గుర్తించాలని హితవుపలికారు.

## 'ఆలయ పవిత్రతను దెబ్బ తీస్తే ఊరుకోం'

వేములవాడ, డిసెంబర్ 26: వేములవాడ రాజన్న ఆలయ పవిత్రతను దెబ్బ తీస్తే ఊరుకోబోమని, వరుస సంఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దర్యాప్తు జరిపించాలని వేములవాడ బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు డిమాండ్ చేశారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా రాజన్న ఆలయ పరిసరాల్లో మాంసాహార భోజన పంపిణీ ఘటనకు నిరసనగా గురువారం రాజన్న ఆలయ పడమటి ద్వారం వద్ద ఆందోళన చేసి, మాట్లాడారు. భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి విచారణ జరిపించాలని, బాధ్యులను గుర్తించి ఆలయ పవిత్రతను, భక్తి విశ్వాసాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇక్కడ నాయకులు వాసం మల్లేశం, రేగుల రాజ్ కుమార్, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, నేరెళ్ల సాయి, లక్ష్మీరాజం, రేగుల శ్రీకాంత్, శ్రీనివాస్, చిలువేరి బాబు, కోరేపు నరేశ్, ఖమ్మం పృథ్వీరాజ్, వెంకటేశ్ ఉన్నారు.

## ఆలయ పరిసరాల్లో సంప్రోక్షణ



సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 26: రాజన్న ఆలయ పరిసరాల్లో యాచకులు మాంసాహారంతో కూడిన ఆహారం తిన్నందున గురువారం అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రెండ్రోజుల కింద గుడి చెరువు పరిసరాల్లో, ఆలయ పశ్చిమ వైపున భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లేలా జరిగిన పరిణామాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం ఉదయం అర్చకులు సంప్రోక్షణ చేసినట్లు తెలిపారు.

## కొండ చెరువులోకి మానేరు నీరు



నీటిని విడుదల చేస్తున్న నీటిపారుదల శాఖ సిబ్బంది, నాయకులు


ముస్తాబాద్, డిసెంబర్ 26: పోతుగల్ గూడెం గ్రామాల మధ్య 300 ఎకరాల ఆయకట్టు ఉన్న కొండచెరువును నింపేందుకు గురువారం ఎగువ మానేరు ప్రాజెక్టు కాల్వ నుంచి నీటిని విడుదల చేశారు. ఆయకట్టు పరిసర గ్రామాల్లోని వ్యవసాయబావులు, బోర్లలో నీరు తగ్గిపోవడంతో రైతుల విజ్ఞప్తి మేరకు స్పందించి నీటిని వదిలినట్లు నీటి పారుదల శాఖ సిబ్బంది తెలిపారు. కాగా, నీటి విడుదలపై మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్నేన్ని అంజన్‌రావు, మాజీ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

## చిట్‌ఫండ్ అసోసియేషన్ కార్యవర్గం

విద్యానగర్, డిసెంబర్ 26 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వామోదిత చిట్‌ఫండ్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక శ్రీనిధి చిట్స్ సమావేశ మందిరంలో జరిగింది. దీనిలో రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రొంటాల రాజిరెడ్డి, అధ్యక్షుడిగా పెంట శ్రీనివాస్, ముఖ్యకార్యదర్శిగా చీటీ సత్యనారాయణ రావు, కోశాధికారిగా అల్లంకి రంజిత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నామా రామ్మోహన్ రావు, చెరుకు మహేశ్, నాంపల్లి శ్రీనివాస్, ఆడెపు మురళి, సంయుక్త కార్యదర్శులుగా రొంటాల రాంరెడ్డి, పెద్ది హరీశ్, దార అశోక్, ఏ తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనంతుల చంద్రకాంత్, సాంస్కృతిక కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, ముఖ్య సలహాదారుగా కొండా వేణు మూర్తి, సలహాదారులుగా బోయినపల్లి నర్సింగ్ రావు, గుజ్జుల అనంతరెడ్డి, గొట్టిముక్కల కోమల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు.

## వైభవంగా సఫల ఉత్పాన ఏకాదశి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్ లోని మయూరగిరి పీఠం శ్రీనిలయం లో పరమ పవిత్రమైన మార్గశిర మా సంలో బహుళపక్షంలో వచ్చే సఫల ఉత్పాన ఏకాదశి ఉత్సవాలు చాలా వైభవంగా జరిగాయి. మయూరగిరి పీఠాధిపతులు జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండ రమణాచారి స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి లక్ష్మీ నారాయణ స్వామికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు.




# నేర నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా పెట్టాం
- వేములవాడలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- ఎస్పీ అఖిల్ మహాజన్
- వేములవాడ పట్టణ ఠాణాలో తనిఖీ

వేములవాడ, డిసెంబరు 26: నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా వేసి వారి కదలికలను నిషితంగా పరిశీలిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణ ఠాణాను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. వేములవాడ పట్టణానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని, పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాంపల్లి, నందికమాన్, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్ వంటి ముఖ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తన దృష్టికి వచ్చాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణతో పాటు పట్టణ పరిధిలో పలు జంక్షన్లలో రోడ్డు సంబంధిత ఇబ్బందులను కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చామని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర అంశాలపై సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ పరిష్కరిస్తామని వివరించారు. ప్రస్తుతానికి ఆర్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో కొత్తగా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు చేపడుతామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేస్తామని వివరించారు. వేములవాడ పట్టణ పరిధిలో స్పెషల్, యాక్షన్ టీంలను ఏర్పాటు చేస్తామని, పట్టణంలో 12 లోకేషన్లు గుర్తించి ప్రతి గంటకోసారి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ నిరంతరం భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. రాజన్న ఆలయ పరిసరాల్లో ఉండే యాచకులకు ఆహారం బయట అందిస్తే వారు పరిసరాల్లోకి తీసుకువచ్చి తిన్నారని, అక్కడ ఎలాంటి అన్యమత ప్రచారం జరగలేదన్నారు. అయినప్పటికీ ఇక ముందు ఎలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ఆయన వెంట పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమేశ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు

- ఇప్పటివరకు 1,512 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశాం
- బీసీఎం కంటి దవాఖాన వ్యవస్థాపకులు వైరాగ్యం రాజలింగం-రీట బహదుర్‌షా

బోయినపల్లి, డిసెంబర్ 26: కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పటివరకు 1,512 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు దవాఖాన వ్యవస్థాపకులు ప్రముఖ కంటి వైద్య నిపుణులు వైరాగ్యం రాజలింగం-రీట బహదుర్‌షా దంపతులు తెలిపారు. బుధవారం 17 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయగా, గురువారం వారందరితో పాటు మరో 25 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వపు జిల్లాతో పాటు ఇతర జిల్లాల పేద ప్రజలకు ఉచిత కంటి వైద్యం అందించేందుకు కొదురుపాకలో కంటి దవాఖాన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి నెలలో రెండు మూడు సార్లు ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆదివారం సెలవు మినహ ప్రతి రోజు కంటి దవాఖానలో నామినల్ ఫీజు రూ.50 తీసుకుని కంటి పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు ప్రతి బుధవారం ఏదో ఒక గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంటి వైద్యురాలు బిల్ల అనూషరెడ్డి, విజన్ పరీశీలకులు అన్వేష్, రిషబ్ మేనేజర్ ధారవేణి తిరుపతి, కౌన్సిలర్ పయ్యావుల రాజు, ఓటీ సిబ్బంది బిజి,చంద్రయ్య, సత్య, రాజు,రాజ్‌కుమార్, రమేశ్, పావని తదితరులు ఉన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న డా.వైరాగ్యం రాజలింగం

# బీడీ కార్మికులకు ₹ 4వేల జీవనభృతి ఇవ్వాలి

- బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 26: రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత బీడీ పరిశ్రమే అతి పెద్దదని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీడీ పరిశ్రమపై ఆధారపడి దాదాపు 8లక్షల మంది జీవిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న ఆంక్షలతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వంలో బీడీ కార్మికులకు రూ.2500 పింఛన్ అందించిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.4వేలు జీవనభృతి అందిస్తామని చెప్పి మోసం చేశారని, ఏడాది కావస్తున్నా హామీయే మరిచిపోయారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎటువంటి ఆంక్షలు లేకుండా పీఎఫ్ ఉన్న కార్మికులందరికీ జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. లేదంటే బీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్

# శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

- సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి
- మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలే
- 'మీ కోసం'లో పోలీసులు

ముస్తాబాద్, డిసెంబర్ 26: ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని, ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు పేర్కొన్నారు. 'మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. గురువారం రాత్రి రామలక్ష్మణులపల్లెలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాను నేర రహితంగా మార్చేందుకు ఎస్పీ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఇక్కడ ఎస్ఐ గణేశ్ సిబ్బంది పాల్గొన్నారు.



ముస్తాబాద్: రామలక్ష్మణులపల్లెలో మాట్లాడుతున్న రూరల్ సీఐ మొగిలి

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 26: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని పట్టణ సీఐ కృష్ణ సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రగుడులో 'మీ కోసం' లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో సీసీ కెమెరాలు పెట్టుకొని దొంగతనాలను నివారణకు సహకరించాలని సూచించారు.

### సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

రుద్రంగి, డిసెంబర్ 26: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ అశోక్ సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం రుద్రంగిలోని రామకృష్ణారావు పల్లె కాలనీలో ' మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు చట్టాలు, సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ చట్టాలపైన ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, ఏటీఎం ఓటీపీ, కేవైసీ, మైనర్ డ్రైవింగ్, గంజాయి వంటి వాటిపై అవగాహన కల్పించారు.

### మద్యం తాగి వాహనం నడిపితే చర్యలే

వీర్నపల్లి, డిసెంబర్ 26: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వీర్నపల్లి మండలకేంద్రంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన 'మీ కోసం' కార్యక్రమంలో ఎస్ఐ ఎల్లాగౌడ్ మాట్లాడారు. మైనర్లు వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయాణిస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు అధిక నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ పాటి దినకర్, గ్రామస్తులు ఉన్నారు.

# కూలీలకు పనిదినాల కల్పన కష్టమే

- ఉపాధి పనిలో పూడికతీతకు మంగళం
- ఫీల్డ్, ఫీడర్ ఛానల్స్, మట్టిరోడ్లే దిక్కు పండ్లతోటలు, ఫాంపాండ్లకు ఓకే
- వచ్చే ఆర్థికం నుంచి అమలుకు చర్యలు
- మండలాల నుంచి జిల్లాకు చేరిన ప్రణాళిక జాబితాలు

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 26: ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులకు కేంద్రం మంగళం పాడింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి చెరువులు, కుంటల్లో పూడిక పనులు చేపట్టొద్దంటూ గ్రామీణాభివృద్ధి శాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీకాగా, దీనిని మినహాయించి మిగతా పనులపై ప్రణాళికలు సిద్ధం చేశారు. కూలీలకు అధిక పనిదినాలు కల్పిస్తున్న పూడికతీతను ఎత్తేయడంతో, పనిదినాలు కల్పించడంపై తీవ్ర ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధిహామీ పథక నిబంధనల మేరకు గ్రామాల్లో కూలీలకు పని కల్పించేందుకు 256 పనులు గుర్తించే వీలుండగా, వీటినుంచి ఏటేటా ఒక్కో పనిని తొలగిస్తుండడంతో భవిష్యత్‌లో కూలీలకు కామధేనువైన ఉపాధి హామీ పథకం అందని ద్రాక్షలా మారే అవకాశాలుంటాయని అధికారులే పేర్కొంటున్నారు. గతంలో పనులు జరిగిన చెరువుల్లో తిరిగి మూడేళ్లదాకా ఎలాంటి పనులు చేపట్టొద్దంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో, గ్రామాల్లో కేవలం ఫీల్డ్, ఫీడర్ ఛానల్స్, మట్టిరోడ్ల పనులు, పండ్లతోటల పెంపకం కోసం గుంతలు తీయడం, ఫాంపాండ్ల తవ్వకంతో పాటు ఎస్సారెస్పీ కాల్వల్లో జంగిల్ క్లియరెన్స్, డిసిల్టింగ్ పనులు మాత్రమే గుర్తించినట్లు తెలుస్తోంది. కెనాల్స్‌లో భారీగా పూడిక పేరుకుపోగా, ఈపనులు చేపట్టాలా వద్దా అనే సంశయంలో అధికారులున్నట్లు సమాచారం. వేసవిలో చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతుండగా అటు కూలీలకు నిత్యం పనిదినాల కల్పనతో పాటు ఆ పూడిక రైతుల పొలాల్లోకి సేంద్రియ ఎరువుగా వినియోగమయ్యేది. అయితే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్న నిర్ణయం ఇటు రైతులకు, అటు కూలీలకు శాపంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఉపాధి పనుల కల్పనలో అత్యంత కీలకమైన పూడికతీత పనిని తొలగించడంతో, వారికి వందరోజుల పనిదినాల కల్పన గగనకుసుమమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మిగతా పనులతో కూలీలకు సరిపడా పనిదినాల కల్పన సాధ్యంకాదని అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఫీడర్ ఛానల్స్, ఫాంపాండ్స్, చేపల చెరువుల తవ్వకంతో కూలీలకు అంతంత మాత్రంగానే పని లభించనుంది. వీటి తవ్వకానికి కూడా సవాలక్ష ఆంక్షలు విధించడంతో రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఒక్కో ఫాంపాండ్ నిర్మాణానికి 12 మీటర్లకు తక్కువ కాకుండా భూమి వినియోగించాలని సూచిస్తుండగా, దాదాపు నాలుగైదు గుంటల భూమి వదలాల్సి వస్తోంది. అయితే, జిల్లాలో అత్యధిక మంది రైతులు చిన్న కమతాలే కలిగి ఉండడంతో అంత భూమి వదులుకునేందుకు సిద్ధంగా లేకపోగా, ఫాంపాండ్లు, చేపల చెరువుల తవ్వకం పనులపై ఆసక్తి కనబర్చడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కూలీలకు ఉపాధి కల్పించేందుకు వీలుగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసు దేవరెడ్డి కోరారు.

## ఆలయంలో చోరీకి యత్నం

చందుర్తి, డిసెంబర్ 26: బండపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయ ఆవరణలో ఉన్న హుండీని ఇనుపరాడ్లతో పగులగొట్టేందుకు యత్నించగా, తెరుచుకోకపోవడంతో వెంట తెచ్చుకున్న సామగ్రిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆలయ అర్చకులు కుదంగూల్ల శ్రీకాంతాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం లక్ష్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

## మహిళ అదృశ్యం

తెలంగాణ చౌక్, డిసెంబర్ 26: సిరిసిల్ల పట్టణానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి దేవవ్వ(40) రెండ్రోజుల క్రితం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగిరాకపోవడంతో మరిది సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె నీలిరంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నదని, ఆచూకీ తెలిసినవారు 8712656366, 9404714707లో సమాచారం అందించాలని సూచించారు.

## యువత క్రీడల్లో రాణించాలి

ముస్తాబాద్, డిసెంబర్ 26: గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏఎంసీ డైరెక్టర్ రాగం నాగరాజు పిలుపునిచ్చారు. మొర్రాయిపల్లె గ్రామంలోని వాలీబాల్ క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తులు అందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.

## యువకుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్

ఇల్లంతకుంట, డిసెంబర్ 26: రెండు కిడ్నీలు చెడిపోయి దవాఖానలో చికిత్స పొందుతున్న పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కీర్తి రాజుకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్ గౌడ్, కేతిరెడ్డి నవీన్ రెడ్డి రూ.10వేల చొప్పున వేర్వేరుగా ఆర్థిక సాయం చేశారు. బాధితుడికి అండగా నిలిచిన వారిని గ్రామస్తులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు గాలిపెల్లి విద్యార్థిని



జెట్టి కీర్తన

ఇల్లంతకుంట, డిసెంబర్ 26: సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గాలిపెల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జెట్టి కీర్తన ఎంపికైనట్లు పీఈటీ సాన బాబు గురువారం తెలిపారు. 18న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైయిందని తెలిపారు. 27 నుంచి 30 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కీర్తనను హెచ్ఎం పావని, జిల్లా ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సంపత్ రావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ పద్మ అభినందించారు.

## వేములవాడలో సీపీఐ ర్యాలీ

వేములవాడ, డిసెంబర్ 26: సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా వేములవాడలో ఆ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమం నాటి నుంచే కార్మికుల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని కొనియాడారు. ర్యాలీలో నాయకులు అజ్జ వేణు, కేవీ అనసూర్య, దుండ్రపల్లి రవీందర్, దేవరాజ్, శ్రీరాముల నర్సయ్య, పందుల మల్లేశం, గాజుల వజ్రవ్వ, కోరేపు క్రాంతి, కోరేపు శ్రీనివాస్, మనితేజ, ఉన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, డిసెంబర్ 26: నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ, ఉద్యోగ ఉపాధి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శ్రీనివాస్ సూచించారు. గురువారం మల్యాలలో ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, సమన్వయంతో జాబ్ మేళా నిర్వహించగా, విశేష స్పందన వచ్చింది. చందుర్తి మండల కోఆర్డినేటర్ శ్రీలత, శ్యామల, మంజుల, గంగాధర్, మధు, సతీష్, సుధాకర్, గంగాధర్, ముకేష్, శ్రీనివాస్, సాయికృష్ణ, శివ, గంగమల్లు, చరణ్, శంకర్, నరేష్, ప్రశాంత్, వంశీ, సాగర్ ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ హెల్త్ సెంటర్ హెడ్ కిరణ్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 26: మెడికవర్ హాస్పిటల్(కరీంనగర్), పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(పోపా) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికవర్ హెల్త్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో దవాఖాన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఇక్కడ పోపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పున్నంచందర్, స్థానిక కౌన్సిలర్ వేముల రవి, హరిప్రసాద్, రత్నాకర్, ఈశ్వర్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజంగౌడ్ పాల్గొన్నారు.

## పాత పింఛన్ విధానం అమలుకు పోరాడాలి

కలెక్టరేట్, డిసెంబర్ 26 : ఉద్యోగులకు ఉరితాడుగా మారిన కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం ఎత్తేసి, పాత పింఛన్ విధానం అమలు చేసేందుకు ఉద్యోగులంతా ఏకమై పోరాటం కొనసాగించాలని, ఓపీఎస్ అమలు పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే కోటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని మంకమ్మతోటలోని ఆ సంఘ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఓపీఎస్ అమలు చేస్తున్న దృష్ట్యా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ రాష్ట్రంలో కూడా పునఃప్రవేశపెట్టాలని కోరారు. పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగులు హరిచందన్, వై వెంకటేశ్వర్‌రావు, సంతోష్‌రావు, నాయిని రాజేంద ర్, బింగి రాజశేఖర్, రఘుపతిరెడ్డి, బెజ్జారపు రాజు, మనోహర్, గులాబీల రాంరెడ్డి, రామక ఆంజనేయశర్మ, రావుల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.